సాక్షి తిరుపతి

ఆదివారం । 12 । నవంబర్ । 2023



వరసిద్ధుని సేవలో న్యాయమూర్తి

కాణిపాకం వినాయకస్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి నటరాజన్ దర్శించుకున్నారు.



ఏపీ ఓటరు జాబితాలోనే ఉన్నాం

ఏపీ ఓటర్లుగానే ఉన్నామని రామకుప్పం మండలానికి చెందిన జయరామిరెడ్డి, రాజమ్మ దంపతులు తెలిపారు. - 2లో

సమష్టి కృషితోనే పర్యావరణ రక్షణ



తిరుపతి అర్బన్ : ప్రజల సమష్టి కృషి తోనే పర్యావరణ రక్షణ సాధ్యమని ఇంజనీర్ నరేంద్ర బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దీపావళిని పురస్కరించుకుని కాలుష్య రహిత బాణసంచా వినియోగించాలని కోరుతూ ప్రచారం చేసినట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

దేశంలోనే తొలిసారిగా ఏపీలో పెప్పర్ కంపెనీ



ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: జర్మనీకి చెందిన పెప్పర్ కంపెనీ స్థాపనకు దేశంలోనే తొలిసారిగా ఏపీ ప్రభుత్వం అవకాశం ఇవ్వడంపై ఆ యాజమాన్యం శనివారం కృతజ్ఞతలు తెలుపుతూ సీఎంవోకు లేఖ రాసింది. ఈ వివరాలను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. గత నెల 31న జరిగిన ఏపీ మంత్రి మండలి సమావేశంలో జర్మన్ కంపెనీ పుంగనూరు మండలం ఆరడిగుంట ప్రాంతంలో 800 ఎకరాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ఆమోదించింది. దీంతో ఈనెల 29న జర్మన్ కంపెనీ ప్రతినిధులు ఫౌండర్ క్రిష్టియన్‌వాగ్నర్, బ్యాస్టియన్‌ఫెడ్రిచ్, సీఈవో అండ్రియస్, సీబీవో రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 మందితో కూడిన బృందం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశం కానున్నట్లు ఎంపీ తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సు, ట్రక్కు, బ్యాటరీలు తయారుచేసే ఈ కంపెనీ ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుందని చెప్పారు. ఈ నెలాఖరులో భూసేకరణ పనులకు అవసరమయ్యే నిధులు కంపెనీ వారు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల కంపెనీ పడమటి నియోజకవర్గాలకు తలమానికంగా నిలవనుందన్నారు.

రేపటి 'స్పందన' రద్దు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని దీపావళి సందర్భంగా రద్దు చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. ఈ నెల 20వ తేదీని యథావిధిగా కలెక్టరేట్‌లో స్పందన ఉంటుందని వెల్లడించారు.

14 నుంచి స్విమ్స్‌లో 'గ్యాస్ట్రో'కి ఓపీ

తిరుపతి కల్చరల్ : తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఈ నెల 14వ తేదీ నుంచి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ సేవలను పునఃప్రారంభించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్రవారం ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. స్విమ్స్ పద్మావతి ఓపీడీ బ్లాక్‌లో ఉదయం 7 నుంచి 11 గంటల లోపు ఓపీ నమోదు చేసుకొని 41,42 రూమ్‌లలో సేవలు పొందాలని సూచించారు.

చంద్రమోహన్‌తో ఆత్మీయానుబంధం



చంద్రమోహన్ సినిమా షూటింగ్ చేసిన అతిథిగృహం

చిల్లకూరు : సినీ నటుడు చంద్రమోహన్ మృతికి చిల్లకూరు వాసులు సంతాపం తెలిపారు. ఆయనతో పెనవేసుకున్న ఆత్మీయానుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 1990వ దశకంలో వింత కోడళ్లు, కలికాలం చిత్రాల షూటింగ్ మండలంలో జరిగిన రోజులు, అప్పటి స్మృతులను నెమరువేసుకున్నారు. మండలంలోని రైటార్ సత్రంలో ఉన్న సవేరా హోటల్ గ్రూప్స్ అధినేత అల్లారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డికి చెందిన అతిథిగృహంలో చంద్రమోహన్ సినిమాల చిత్రీకరణ జరిగిందని వెల్లడించారు. అప్పట్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు సినిమా షూటింగ్ చూసేందుకు వచ్చారన్నారు. ఆ సమయంలో చంద్రమోహన్ ఎంతో ప్రేమగా నడుచుకున్నారని, ప్రజలతో మమేకమయ్యేవారని వివరించారు. సినీరంగానికి ఆయన లేని లోటు తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు.



కలికాలం చిత్రం వర్కింగ్ స్టిల్



పెద్దశేషవాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఎమ్మెల్యే చెవిరెడ్డి



కళాకారుల నృత్యభంగిమ

శ్రీవాణిగా సిరులతల్లి

మంగళవాయిద్యాలు.. కోలాటాలు.. భజనలు.. కళాప్రదర్శనల నడుమ శ్రీవారి దేవేరి పద్మావతీదేవి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం పెద్దశేషవాహనంపై బద్రీనారాయణుడి అవతారంలో కొలువుదీరి భక్తులకు యోగశక్తిని అనుగ్రహించారు. మధ్యాహ్నం సుగంధ శోభిత జలలు.. ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా నిర్వహించిన స్నపన తిరుమంజనసేవలో సేదతీరారు. సాయంత్రం జ్ఞాన ప్రదాయినిగా సిరులతల్లి ఊయలలూగుతూ ఆపన్నలకు అభయమిచ్చారు. రాత్రి రాయంచపై వీణాపాణి అలంకారంలో ఊరేగుతూ సకల జనులను కటాక్షించారు. వాహన సేవల్లో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - చంద్రగిరి



హంస వాహనంపై వీణాపాణి అలంకారంలో ఊరేగుతున్న పద్మావతీదేవి

శాస్త్రోక్తం.. స్నపన తిరుమంజనం



విశేషాలంకరణలో అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో ఫల పుష్పాలతో రూపొందించిన వేదికపై కంకణభట్టర్ మణికంఠ బట్టర్ ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా వైభవంగా వేడుక జరిపించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం, ఛత్ర చామర, వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం సమర్పించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలు చేపట్టారు. అనంతరం గుమ్మడి గింజలు, గోల్డ్ గ్రేప్స్, స్వీట్ కార్న్, సంపంగి, వృచి, పింక్ రోజ్ పెటల్స్, తామరపూల గింజలు, తులసి, రంగురాళ్లతో కూడిన రోజామాలలను అమ్మవారికి అలంకరించారు. ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాతికేళ్ల పసిడి పంట

విదేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇప్పుడు మన ముంగిట్లో వాలింది. రైతు ఇంట పాతికేళ్ల బంగారు పంటగా మారింది. ఒకసారి సాగు చేస్తే 25 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది. చీడపీడల బెడద, నీరు, కూలీల ఖర్చు తక్కువ కావడంతో రైతాంగం ఈ డ్రాగన్‌పై మక్కువ చూపుతోంది. ఈ పంటకు మార్కెటింగ్ సదుపాయమూ ఉంది. అన్ని ఫలాల కంటే ఈ పండు ధరలు అధికంగా ఉండడంతో రైతులకు లాభార్జన సులభతరమవుతోంది. దీంతోపాటు పోషకాలను పుష్కలంగా కలిగి ఉన్న ఈ పండు సాగుపై ప్రత్యేక కథనం.

- జిల్లాలో విస్తరిస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ సాగు
- ఓ సారి నాటితే 25 ఏళ్లపాటు దిగుబడి
- తొలి రెండేళ్లలోనే పంట పెట్టుబడి చేతికి
- ప్రముఖ ఆన్‌లైన్ సంస్థల్లోనూ మంచి గిరాకీ



వి.కోట మండలం తోటకనుమ వద్ద ట్రెల్లీస్ విధానంలో సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ తోట (ఇన్‌సెట్) తోటలో విరగ్గాసిన ఫలాలు

పలమనేరు : రకరకాల వాణిజ్య పంటలు, మామిడి తోటల కంటే రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాన్ని అందించే కొత్త వంగడాలవైపు జిల్లాలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇన్నాళ్లు తైవాన్, వియత్నాం దేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లోనూ పండుతోంది. దీంతో మనకూ అందుబాటులోకి వచ్చేసింది. నాటిన తొలి ఏడాది మూడు నుంచి రూ.4 లక్షల పెట్టుబడి పెడితే రెండేళ్లలో ఆ మొత్తం వచ్చేస్తోంది. ఆపై 25 ఏళ్లపాటు ఏటా రైతులకు ఆదాయం వస్తుండడంతో ఇప్పుడు రైతులు డ్రాగన్ సాగుపై మక్కువ చూపుతున్నారు. పైగా ఈ పంటకు చీడపీడల బెడదలు కూలీల సమస్య తక్కువ. ముఖ్యంగా తక్కువ నీటి సౌకర్యమున్న రైతులకు వరం. రైతు పండించిన పంటకు తోటల వద్దే మార్కెటింగ్ సౌకర్యం ఉంది. మరోవైపు స్విగ్గీ, బిగ్‌బ్యాస్కెట్, రిలయన్స్ తదితర ఆన్‌లైన్ సంస్థలు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నాయి.

మంచి పోషకాలు కలిగిన ఫలం

డ్రాగన్ ఫ్రూట్‌కు విదేశాల్లో ధనికుల ఫలం అనే పేరుంది. కాని నేడు స్థానికంగా ఈ సాగు మొదలు కావడంతో తోటల వద్దే ఫలాలను విక్రయిస్తున్నారు. పండ్ల మార్కెట్లలోనూ ఇవి విరివిగా లభ్యమవుతున్నాయి. ఇందులో మధుమేహం, క్యాన్సర్, మంచిగా జీర్ణం, గుండెకు సంబంధించి, మంచి చర్మకాంతికి, వెంట్రుకలు పెరిగేందుకు, ఎముకల పుష్టికి మేలు చేస్తుందట.

తోటవద్దకే వ్యాపారులు

వ్యాపారులు తోట వద్దకే వచ్చి డ్రాగన్‌ఫ్రూట్‌ను కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు ఆన్‌లైన్ వ్యాపార సంస్థలైన స్విగ్గీ, రిలయన్స్‌మార్ట్, బిగ్ బ్యాస్కెట్, రత్నజీత్ సూపర్ మార్కెట్లనుంచి వీటికి మంచి గిరాకీ ఉంది. వారు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం 400 గ్రాము ఉన్న పండ్లు కిలో రూ.130 దాకా, 250 గ్రాములకంటే తక్కువున్న ఫలాలు కిలో రూ.70 దాకా పలుకుతున్నాయి.

జిల్లాలో తొలిసారిగా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ములకల చెరువు, కలిచెర్ల, కంభంవారిపల్లి మండలాల్లో కొందరు ఔత్సాహిక రైతులు రెండేళ్లక్రితం డ్రాగన్‌ఫ్రూట్‌ను సాగుచేశారు. అయితే మొట్టమొదట వీకోటకు చెందిన మోహన్‌రావు తన మూడెకరాల పొలంలో 8వేల మొక్కలను ట్రెల్లీస్ విధానంలో నాటారు. ఆయన సియాన్ రెడ్ అనే రకాన్ని హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ నుంచి 8వేల మొక్కలను తెప్పించారు. మొక్కకు రవాణా చార్జీలతో కలిపి రూ.76 ఖర్చయింది. ఆ లెక్కన 8 వేల మొక్కలకు రూ.6 లక్షలు, మొక్కకు ఊతంగా నిర్మించిన 420 సిమెంట్ స్తంభాలు రూ.550 చొప్పున రూ.2.3 లక్షలైంది. దీంతోపాటు ఎరువులు, దున్నకం, కూలీలు ఖర్చులతో మూడెకరాలకు రూ.10 లక్షలు ఖర్చయింది. అంటే ఎకరానికి రూ.3.3 లక్షలన్నమాట. పంటకు సత్తువగా గొర్రె, కోడి ఎరువు, ఆరు బస్తాల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, ట్రైకో ధర్మావరిడి, సుడోమస్‌లను కలిపి మొక్కకు మక్కిరి మిశ్రమ ఎరువును మాత్రమే వాడారు. పంట నాటాక ఆరు నెలలకు అంటే జనవరిలో నాటితే జూన్‌లో పుష్పాలొచ్చాయి. ఆపై 21 రోజులకు తొలి కోత వచ్చింది. తొలికోతలో మూడెకరాలకు రెండు టన్నులు, రెండో కోతలో ఐదు టన్నులు, మూడో కోతలో 13 టన్నుల దిగుబడిని సాధించారు. మొత్తం మీద ఇప్పటికి 30 టన్నుల దాకా దిగుబడి వచ్చింది.

ట్రెల్లీస్ విధానంలో మొక్కల సాగు

ఇప్పటి వరకూ అనంతపూర్, కడప జిల్లాలో మొదలైన ఈ పంట మూడేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలోని కంభంవారిపల్లి మండలం చీనేపల్లిలో రైతు శ్రీనాథరెడ్డి, కలిచెర్లలో రహంతుల్లా, ములకల చెరువులో ఓ రైతు డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేశారు. స్తంభాలపై పాత బైక్ టైర్లను వాడి ఎకరానికి రెండు వేల మొక్కలను సాగు చేశారు. ట్రెల్లీస్ విధానం ద్వారా ఎకరానికి మూడు వేల మొక్కలను నాటుకోవచ్చు. దీంతో అదనపు దిగుబడి రావడంతో అధిక ఆదాయం వస్తోంది.




డ్రాగన్‌ఫ్రూట్స్

ముందు అధ్యయనం చేశా



నేను మూడెకరాల మెట్టపొలంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేశా. ప్రస్తుతం కోతలు సాగుతున్నాయి. తోటవద్దే కాకుండా ఆన్‌లైన్ వ్యాపార సంస్థలకు విక్రయిస్తున్నా. ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. సముద్రమట్టానికంటే 1250 అడుగుల ఎత్తులో ఉన్నాం. దీంతో పంట ఉత్పత్తులు బాగున్నాయి. నేను పంటకు పెట్టిన పెట్టుబడి రెండేళ్లలో వచ్చేస్తుంది. ఆపై 25 ఏళ్ల వరకు తోటను బాగా చూసుకుంటే ఏటా దక్కేది లాభాలే కదా.

– డా.మోహన్‌రావు, రైతు, వీకోట

కొత్తపంటల సాగుతో రైతులకు మేలు



ఆహార, వాణిజ్య పంటలను పండించి గిట్టుబాటు గాని రైతులు ఇప్పుడు విభిన్నంగా ఆలోచిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రపంచంలోని పలు రకాల కొత్త వంగడాలు, పంటల సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో డ్రాగన్‌ఫ్రూట్ సాగుపై రైతులు ఆసక్తిని చూపడం మంచి పరిణామం. దీంతో పంట పెట్టుబడి తొలి ఏడాది ఎక్కువగా ఉన్నప్పటికీ ఆపై రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాలుంటాయి.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

'గజ' బాధితులకు అండగా..!



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల : ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని, వారికి త్వరితగతిన పరిహారం మంజూరు చేయిస్తామని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం మండలంలోని పదిపుట్లబైలు, ఈ-పాలగుట్టపల్లె, పేరసానిపల్లె పంచాయతీల్లో ఇటీవల ఏనుగుల కారణంగా ధ్వంసమైన పంటలను పరిశీలించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని, అన్ని వేళలా అండగా ఉంటామని తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు వచ్చే దారులను డ్రోన్ కెమెరాలతో గుర్తించి కందకాలు తవ్విస్తామని, పటిష్టమైన రెయిలింగ్‌లు ఏర్పాటు చేయిస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం తొలి విడతగా రూ.25లక్షలు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. ఏనుగుల గుంపును దారి మళ్లించేందుకు రైతులు సైతం సమష్టిగా సహకరించాలని కోరారు. డీఎఫ్ఓ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏనుగుల గుంపు ఒక్కోసారి మనుషులపై దాడికి దిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ క్రమంలో ట్రాకర్లను అప్రమత్తం చేసి వాటిని దారి మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ మాధవీలత, ఎంపీపీ లోకనాథం, పార్టీ డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, రఘుపతి, రామ్మూర్తి, గోపి, నరేష్, రఘు, శ్రీనివాసులు, శ్రీరాములు, కుమార్, తిమ్మయ్య, రామచంద్ర, చంద్రబాబు, ఎంపీడీఓ ప్రభాకర్, డీటీ పరదేశి పాల్గొన్నారు.

అరణియార్ గేట్ ధ్వంసంపై ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఏఈఈ లోకేశ్వర్ రెడ్డి, వాచ్‌మన్ గణేష్

పిచ్చాటూరు : మండలంలోని అరణియార్ జలాశయం గేట్ తాళాలు పగులగొట్టిన నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ ఏఈఈ లోకేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు.. నీరువాయి గ్రామానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం రెప్పాలట్టు వద్ద అరణియార్ గేట్‌లను ధ్వంసం చేశాడు. దీనిపై ప్రశ్నించిన వాచ్‌మన్ గణేష్‌పై దాడికి దిగాడు. తన అనుచరులు లడ్డు మోహన్, ఢిల్లీ, గవ్వ, భరత్, వినయ్‌లతో పాటు మరో 20 మందిని ఫోన్ చేసి రప్పించి మళ్లీ గణేష్‌ను చితక్కొట్టాడు. అడ్డుకోబోయిన గణేష్ అన్న కుమార్ చేతిపై కత్తితో పొడిచాడు. దీనిపై సమాచారం అందుకున్న ఇరిగేషన్ అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మేము ఏపీ ఓటరు జాబితాలోనే ఉన్నాం

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ కంచిదాసనపల్లెకు చెందిన జయరామిరెడ్డి, రాజమ్మ దంపతులకు కర్ణాటకలో ఓటరు కార్డులుండగా, కంచిదాసనపల్లి పోలింగ్ బూత్ నెంబరు 617, 618లో కూడా వీరికి ఓట్లు ఉన్నట్లు ఓ పత్రిక శనివారం వార్తను ప్రచురించింది. నిజనిర్ధారణలో భాగంగా శనివారం స్థానిక బీఎల్‌ఓ వెంకటరమణ కంచిదాసనపల్లిలో నివాసముంటున్న జయరామిరెడ్డి దంపతులను విచారణ చేశారు. వారు మాట్లాడుతూ మేము ఆంధ్రలోనే ఉన్నాం.. ఇక్కడ మాకు ఓటరు కార్డులు ఉన్నాయన్నారు. జీవనోపాధి కోసం వెళ్లిన మాకు 2007లో కర్ణాటకలో ఓటరు కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే మాకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, వెలుగు గ్రూపులో సభ్యత్వం కంచిదాసనపల్లిలో ఉన్నట్లు ఆధారాలు చూపించారు. కంచిదాసనపల్లిలోనే ఓటరు కార్డులకు ఆధార్ కార్డులను సీడింగ్ చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడి ఓటరు కార్డులను కొనసాగించాలని జయరామిరెడ్డి దంపతులు కోరారు.

బాలుడికి గాయాలు

కోట : మండలంలోని కొత్తపాళెం గిరిజన కాలనీలో శనివారం విద్యుత్ స్తంభం ఒరగడంతో ఓ బాలుడు గాయపడ్డాడు. వివరాలు.. నాగరాజు, శ్రావణి దంపతుల కుమారుడు చైతన్య (4) వీధిలో ఆడుకుంటున్నాడు. అక్కడే కొందరు చెట్టు నరకడంతో అది పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో స్తంభం ఒరిగిపోతూ బాలుడికి తగిలింది. తీవ్రంగా గాయపడిన చైతన్యను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఎర్రచందనం పట్టివేత

కోట : మండలంలోని రాఘవాపురంలో శనివారం అటవీ టాస్క్‌ఫోర్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఐదు ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. ఓ ఇంట్లో దుంగలను నిల్వ చేసిన నలుగురు నిందితులను అధికారులు అదుపులోకి తీసుకుని తిరుపతికి తరలించారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అటవీ సిబ్బంది తెలిపారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసాదించాలి

పుంగనూరు/తిరుమల/చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి అర్బన్: దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసాదించాలని మంత్రులు, టీటీడీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, రాజకీయ ప్రముఖులు జిల్లా ఉన్నతాధికారులు ఆకాంక్షించారు. ఆమేరకు శనివారం వారు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రకటనలు విడుదల చేశారు.

కొత్త వెలుగులు నింపాలని..



దీపావళి వెలుగుల పండుగ.. పండుగను ప్రతి ఒక్కరు సంతోషాలతో జరుపుకోవాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే భగవంతుని దయతో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని, రైతులు, వ్యాపారులు, ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఇలాగే ప్రతియేటా వర్షాలు కురిసి, కరువు కాటకాలు లేకుండా చూడాలని శ్రీశబరిమలై అయ్యప్పస్వామిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

వెలుగు రేఖలు ప్రసరించాలని..




తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల జీవితాల్లో దీపావళి వెలుగు రేఖలు ప్రసరించాలని, ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషపు వెలుగులు వెల్లివిరియాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఒక ప్రకటనలో వారు శ్రీవారి భక్తులకు, ఉద్యోగులకు, శ్రీవారి సేవకులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి అనుగ్రహంతో రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని వారు కోరారు.

సరికొత్త కాంతులు నింపాలని..



ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతులను నింపాలని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కోరారు. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా భారతీయ పండుగలు జరుపుకుంటారన్నారు.

సుఖ సంతోషాలు నిండాలని..



ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు నింపాలని రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ఆకాంక్షించారు. అందరూ ఆనందంగా పండుగను జరుపుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని..



చెడుపై మంచి విజయానికి ప్రతీక దీపావళి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుతున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి తెలిపారు. ప్రజలందరు దీపావళి పండుగను జాగ్రత్తగా జరుపుకోవాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కాంతిమయం చేయాలని..



చీకట్లు పారదోలి జన జీవితాలను కాంతిమయం చేయాలని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆకాంక్షించారు. ఒక్కొక్క మార్పు సాధించుకుంటూ గొప్ప జీవితాన్ని నిర్మించుకోవాలని కోరారు.

వెలుగులు విరజిమ్మాలని..




ఈ దీపావళి వేళ లక్ష్మీదేవి ఇరు జిల్లాల ప్రజల ఇంట్లో చేరి వారి జీవితంలో వెలుగులు విరజిమ్మాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కోరుకుంటూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని..

ప్రజలందరూ సహృద్భావ వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని, అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి ఆకాంక్షించారు. ఈ దీపావళి ప్రతి ఇంట్లో ఆనందం సంతోషపు వెలుగులు నింపాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆకాంక్షించారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

ఏర్పేడు : మండలంలోని కొత్తకండ్రిగలో పుష్పిత్ కర్మాగారం వద్ద నీటి గుంతలో పడి శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. సీఐ శ్రీహరి కథనం మేరకు.. నీటి గుంతలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమేరకు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.